ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న మట్టా శేఖర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. శనివారం అంబేడ్కర్ కళాశాలలో నిర్వహించిన ట్రెడిషనల్ డే కార్యక్రమంలోటాయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని తమ కళాశాలలో విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలి


అధికారులతో మాట్లాడుతున్న పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: వేసవి దృష్ట్యా గాంధీనగర్ డివిజన్‌లో తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ సుచించారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిలో బస్తీలు కాలనీలలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. లో ప్రెషర్ తాగునీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


సయ్యద్ అహ్మద్ భక్తియార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముషీరాబాద్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని విద్యావ్యాప్తికి తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) అంకిత భావంతో కృషి చేస్తుందన్నారు. ట్రస్మా ముషీరాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన సయ్యద్ అహ్మద్ భక్తియార్‌ను శనివారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు జి.రాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడీడు పిల్లలను బడిలో చేర్పేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్‌ముదిరాజ్, మోహిన్, సదా, బాలరాజుగౌడ్, కొండా సహదేవ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాలుగున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నల్లకుంట: నల్లకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వేదికైంది. 1977–78 లోని పదో తరగతి పూర్తి చేసిన వారు ఇక్కడ కలుసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులైన ప్రముఖ సంగీత విద్వాంసుడు పోపూరి శ్రీనివాస శర్మ, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్, షరీఫ్, విజయ్ కుమార్, కృష్ణమా చార్యులు, గోపాల్, వాసు, రమణ తదితరులు స్థానికంగా ఉన్న ఓ హోటల్లో భోజనాలు చేస్తూ తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

వీధి దీపాలకు మరమ్మతు చేయండి


బస్తీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: చెప్పల్‌బజార్, కుద్బిగూడ, మణియార్‌పట్టి తదితర బస్తీల్లో వీధి దీపాలు సరిగ్గా వెలగక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే మరమ్మతు చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అధికారులకు సూచించారు. శనివారం డివిజన్‌లోని పలు బస్తీల్లో ఆమె పాదయాత్ర చేస్తూ స్థానికులతో మాట్లాడారు. రాత్రి వేళల్లో ప్రజలు పడుతున్న బాధలు తీవ్రంగా ఉన్నాయని, ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ డీఎంసీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆశిష్, రాజేందర్, సురేష్, పాటిల్, సంతోష్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో సదుపాయాలపై.. సర్వే పూర్తి

వివరాలు నమోదు చేసిన ఉపాధ్యాయులు

- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధుల కోసం వివరాలు నిక్షిప్తం
- సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్న అధికారులు


ఎన్‌బీటీనగర్ హైస్కూల్‌లో విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా బోధన

బంజారాహిల్స్: సర్కార్ బడుల్లో సమగ్ర సమాచార సేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. 2024–25 విద్యా సంవత్సరానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ(యూడైస్ ప్లస్) సర్వేను గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే షేక్‌పేట మండల పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట డివిజన్లలో 26 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉండగా ఖైరతాబాద్–1 మండల పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, చింతల్‌బస్తీ, శ్రీనగర్‌కాలనీ, కమలాపురికాలనీ, పంజగుట్ట ప్రాంతాల్లో ఉన్న 17 ప్రాథమిక, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలల్లో, ఖైరతాబాద్–2 మండల పరిధి కిందికి వచ్చే ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడ ప్రాంతాల్లో ఉన్న 17 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ సర్వే జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మౌలిక వసతుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు, విద్యాభివృద్ధికి నిధులు కేటాయించనున్నాయి. క్షేత్రస్థాయిలో గత ఏడాది సెప్టెంబర్‌లో సేకరించిన సమాచారానికి సంబంధించి తప్పులు ఏవైనా ఉన్నాయో పరిశీలించిన అనంతరం సవరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

ఐదు రోజుల పాటు పరిశీలన..

పాఠశాల స్థాయిలో ప్రత్యేక యాప్‌లో స్కూల్ హెడ్‌మాస్టర్ నమోదు చేసిన వివరాలపై ఇటీవల ఐదు రోజుల పాటు పునః పరిశీలించారు. ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటుచేసి ఆపరేటర్లు ఒక్కో అంశాన్ని నిశితంగా పరిశీలించారు. మండల కార్యాలయాల్లో ఉన్న రిసోర్స్ పర్సన్లు, అధికారులు ప్రతి అంశాన్ని పరిశీలించి సవరణలు ఉంటే సరిదిద్దారు. పేర్లు, ఇతర వివరాలు నమోదు కాకుంటే ఆయా పాఠశాలల నుంచి తెప్పించుకుని పోర్టల్‌లో పొందుపరిచారు. షేక్‌పేట, ఖైరతాబాద్–1, ఖైరతాబాద్–2 మండలాల పరిధిలో 1–10వ తరగతి వరకు 28,656 మంది విద్యార్థులు ఉన్నట్లు తేలింది. పాఠశాల స్థాయిలో అత్యంత కీలక సమాచారం కావడంతో ఆన్‌లైన్‌లో విద్యాశాఖ అధికారులకు నివేదించేందుకు సిద్ధమయ్యారు.

మౌలిక వసతుల కల్పనకు యూ డైస్..

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యకు సరిపడా మౌలిక వసతులు కల్పించడానికి యూ డైస్ ప్లస్ సర్వే కీలకంగా మారింది. అందుబాటులో ఉన్న తరగతి గదులు, క్రీడా మైదానాలు, తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, కుర్చీలు, మధ్యాహ్న భోజన కిచెన్ ఇతర మౌలిక వసతుల వివరాలను నమోదు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమగ్ర వివరాలు, హాజరు, మధ్యాహ్న భోజనం అమలుతీరు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు ఇందులో పొందుపర్చారు. ఆన్‌లైన్ వివరాల ప్రకారం కల్పించాల్సిన వసతులు, అవసరమైన ఉపాధ్యాయుల సంఖ్య కూడా యూడైస్‌లో తేలనుంది. ఖైరతాబాద్ జోన్ పరిధిలో యూడైస్ ప్లస్ సర్వేపై ప్రధానోపాధ్యాయులతో ఉన్నతాధికారులు పలుమార్లు సమీక్షించారు. పాఠశాల స్థాయిలో సేకరించిన వివరాలపై ఐదు రోజుల నిశితంగా పరిశీలించాచు. తప్పులు లేకుండా జాబితాను సిద్ధం చేశారు. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం ఎంతమంది టీచర్లు పనిచేస్తున్నారో ఆ వివరాలు అందజేశారు. విద్యార్థుల ఆధార్ కార్డు లేకపోయినా సరే ఆన్‌లైన్‌లోనూ, రికార్డులోనూ వివరాలు నమోదు చేయడం జరిగింది. విద్యార్థుల హాజరు ప్రకారం రికార్డులు నిర్వహిస్తున్నారో లేదో ఖచ్చితంగా పరిశీలించారు.

టీచర్లు తక్కువే..

యూడైస్ ప్లస్ సర్వే ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 1–10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడాన్ని ఈ సర్వేలో గుర్తించారు. కొన్ని పాఠశాలల్లో సరిపడినంతమంది ఉండగా, మరికొన్ని పాఠశాలల్లో టీచర్ల సంఖ్య తక్కువగా ఉంది.

ఎస్సీ వర్గీకరణలో మాదిగ అమరవీరుల పాత్ర కీలకం


నివాళులర్పిస్తున్న నాయకులు

కవాడిగూడ: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని గత 30 ఏళ్లుగా కొనసాగిన న్యాయ పోరాటంలో మాదిగ అమర వీరుల త్యాగం వెలకట్టలేనిదని ముషీరాబాద్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని రోటరీ కాలనీ బస్తీ అధ్యక్షులు బండారి యాదగిరి ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గజ్జల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ.. అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధరి మహేష్ కుమార్, మల్లేష్, రమేష్, శ్రీకాంత్, మనోజ్, సురేందర్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

పరామర్శ

చిక్కడపల్లి: అంకిత భావంతో పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను పార్టీ అండగా ఉంటుందని హరియణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె , బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కార్యవర్గ సభ్యులు దోనేటి సత్యంను శనివారం ఆమె జవహర్‌నగర్‌లోని సత్యం నివాసానికి వెళ్లి పరామర్శించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న శ్రీధర్

కవాడిగూడ: సమస్యల పరిష్కరంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కమ్యూనిస్టు తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ నేతలు ఆరోపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యంగా ధరల పెరుగుదల విద్యా, వైద్యం, ప్రైవేటీకరణ, నిరుద్యోగం, మద్యం, డ్రగ్స్, పోర్నోగ్రఫీ, వ్యసనాలు, కార్మికుల శ్రమ దోపిడీ విపరీతంగా జరుగుతుందన్నారు. నిత్యం పెరుగుతున్న ప్రజా సమస్యలపై ఎస్‌యూసీఐ(సి) సోషలిస్టు యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న కేంద్ర కమిటీ సభ్యులు కె. శ్రీధర్, ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, నగర కార్యదర్శి భరత్, రాష్ట్ర కమిటీ సభ్యులు జానీ బాషా, గంగాధర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వ్యహించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులు, కాంట్రాక్టర్ల ప్రయోజనాలను కాపాడుతున్నాయన్నారు.

పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో పీఆర్‌సీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడం నిరాశకు గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పీఆర్‌సీని 2023 జూలై నెల నుంచి అమలు చేయాలని అంతే కాకుండా 2023 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఆర్‌లు వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ సి. చంద్రశేఖర్, కోశాధికారి, పి. పెంటయ్య, ఆర్ సీతారామయ్య, విశ్వనాథం, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారం కోసం ప్రత్యామ్నాయ పార్టీ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఈ నెల 15న తెలంగాణలోని బహుజన రాజ్యాధికారం కోసం ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ తెలిపారు. కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని ఏజీ ఆఫీసు ఎదురుగా డిక్కీ ఆఫీస్‌మీటింగ్ హాల్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బహుజనులతో సమాలోచన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మగౌరవం, సమాభివృద్ధి, రాజ్యాధికారంలో భాగస్వామ్యం లక్ష్యంగా తెలంగాణలోని బహుజనులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని, జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ఎంఏ షోయబ్, ప్రతిభాలక్ష్మి ముదిరాజ్, దాసోజు లలిత, గాలి వినోద్‌కుమార్‌తో పాటు పలువురు ప్రొఫెసర్‌లు మేధావులు, రచయితలు పాల్గొంటారన్నారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 2న ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య తెలిపారు. బీపీ, షుగర్‌లతోపాటు ఇతర వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్ ఎస్ రాజకుమారి, డాక్టర్ గోపాలం శివన్నారాయణ పాల్గొంటారన్నారు.

మహిళలకు కరాటేలో ఉచిత శిక్షణ

కాచిగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15 వరకు కరాటేలో ఉచిత శిక్షణతో పాటు ఆత్మరక్షణ కోసం మెలకువలు నేర్పించడంతో పాటు అవగాహన కల్పించడం జరుగుతుందని డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 3వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

గ్రూపు-2 పోస్టులు

కాచిగూడ: గ్రూపు–2 పోస్టులను 783 నుంచి 3 వేలకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. గ్రూపు–2 పోస్టులు పెద్ద మొత్తంలో వస్తాయని, కానీ సంబంధిత శాఖల అధికారులు తప్పుడు లెక్కలు చేసి తక్కువ పోస్టులను చూపుతున్నారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలు, మండలాలు, మున్సిపాలిటీలకు కొత్త పోస్టులు మంజూరు చేయలేదన్నారు. వీటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా గ్రూప్–1,2 పోస్టులలో ఎంతమంది రిటైర్ అయ్యారు, ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారో లెక్కించి భర్తీ చేయాలని సూచించారు.

వేడుకగా వీరభద్రస్వామి పల్లకీ సేవ



కాచిగూడ: శ్రీ వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో వీరభద్ర స్వామి పల్లకీ సేవను భక్తులతో కలిసి సంప్రదాయ బద్ధంగా వేడుకగా నిర్వహించారు. కాచిగూడకు చెందిన వీరభద్ర సేవా సమితి ప్రధానకార్యదర్శి కాసుల వినోద్, శ్వేత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శివరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా ఏటా స్వామి వారి పల్లకీ సేవను నిర్వహిస్తున్నామన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్ తేజ

కాచిగూడ: యువ కవి విష్ణుప్రసాద్ రాసిన కవితలు నేటి సమకాలిక, సామాజిక పరిస్థితులకు అద్దం పట్టేలా ఉన్నాయని పలువురు వక్తలు అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టు, యువకవి విష్ణు ప్రసాద్ రచించిన 'తెగ మురిసే మేక' కవితా సంకలనం పుస్తకాన్ని ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరించారు. విష్ణుప్రసాద్ సామాన్యుల గొంతుకగా ఉంటూ ఎన్నో రకాలైన అంశాలను తన కవిత సంకలనంలో రాశాడని పలువురు ప్రశంసించారు. భవిష్యత్‌లో విష్ణుప్రసాద్ సమాజానికి మార్గనిర్దేశం చేసేలా మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీధర్ రెడ్డి, కవులు కందుకూరి రమేష్, నరేష్, సూఫీ పాల్గొన్నారు.

ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి


పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో నిర్మిస్తున్న వంతెనలతో స్థానిక ప్రజలతో పాటు వేలాది మంది రాకపోకలు సాగించే వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను తొలగించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మూసారంబాగ్ మూసీనదిపై నిర్మిస్తున్న వంతెనపై శనివారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో నిర్మాణ సంస్థ, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంబర్‌పేటలో నిర్మించిన ఫ్లైఓవర్ పూర్తి అవడంతో కొంత ట్రాఫిక్ భారంతగ్గినప్పటికి ముసారంబాగ్ వద్ద వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దిలుషుక్‌నగర్ పోవడానికి ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని ఆయన వెల్లడించారు. 400 మీటర్ల మేర పొడవు బ్రిడ్జ్ నిర్మాణంలో జాప్యాన్ని నివారించాలని సూచించారు. తాత్కలిక ఉపశమనంగా రెండు వైపుల నుంచి కనీసం ద్విచక్ర వాహనదారులను వదిలిపెట్టే అవకాశం ఉందా అని ఆయన ప్రశ్నించారు. బ్రిడ్జ్ నిర్మాణం వద్ద ట్రాఫిక్ మళ్లింపు చర్యలను ఆసరాగా చేసుకొని ట్రాఫిక్ పోలీసులు కాపు కాచి వాహనాల ఫొటోలు పెట్టడంతో స్థానికులు నిత్యం అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. తరతరాలకు ఉపయోగపడే బ్రిడ్జి నిర్మాణ దశలోనే ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్మించాలని సూచించారు. దసరా నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈఈ రోహిణి, ఏఈ ప్రశాంత్ ఉన్నారు.

అన్ని డివిజన్లలో విజయం సాధించాలి


భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముషీరాబాద్: రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మహంకాళీ జిల్లా పరిధిలోని అన్ని డివిజన్ స్థానాల్లో బీజేపీ విజయం సాధించేలా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆ పార్టీ మహంకాళీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్.విశ్వం ఆధ్వర్యంలో నిర్వహించిన టిఫిన్ పే చర్చా కార్యక్రమంలో భరత్‌గౌడ్ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలు పార్టీకి మరింత దగ్గరయ్యేలా కృషి చేయాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి బూత్‌స్థాయి నాయకుల నుంచి రాష్ట్రస్థాయి నాయకుల వరకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాజశేఖర్, కనకేష్‌కుమార్, నిత్యానంద్, మహేష్, నాగేందర్, రాజేష్, సత్యనారాయణ, బబ్లూ, ఉపేందర్ పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో అన్నదానం

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తలారి శ్రీకాంత్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంచిముదిరాజ్, శ్రీను, అశోక్‌కుమార్, పట్నం నరేష్, ప్రకాష్, ప్రవీణ్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి


బడీ మసీదు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: పవిత్ర రంజాన్ మాసంలో మసీదుల అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆయన జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ, శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, జలమండలి డీజీఎం కార్తిక్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్ కృష్ణమోహన్, విద్యుత్ శాఖ స్ట్రీట్ లైట్ సూపర్ వైజర్ బాలునాయక్, ముషీరాబాద్ ఎస్సై ప్రసాద్‌రెడ్డి, చిక్కడపల్లి ట్రాఫిక్ ఎస్సై యాదగిరిరెడ్డితో రంజాన్ మాసంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ ప్రసిద్ధిగాంచిన బడీ మసీదు, బిలాల్ మసీదు తదితర వాటిని సందర్శించి నిర్వాహకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ముషీరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందని, హిందూ ముస్లింలు అధికంగా ఉన్నప్పటికి కలిసిమెలిసి ఉంటారన్నారు. ప్రభుత్వం రంజాన్ మాసం సందర్భంగా ప్రత్యేక నిధులను కేటాయించిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు క్రమశిక్షణతో పని చేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, షరీఫ్, రహీం, శంకర్‌గౌడ్, ప్రభాకర్, మహ్మద్ అలీ పాల్గొన్నారు.

ముస్లింలకు శుభాకాంక్షలు

చిక్కడపల్లి: పవిత్ర రంజాన్ మాస ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముస్లిం సోదరులకు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. అశోక్‌నగర్‌లోని బైట్‌ఫుడ్ స్క్వేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హలీమ్ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

కవాడిగూడ: దోమలగూడలోని రామకృష్ణ మఠంలో రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస తమ దివ్యస్పర్శతో కాఠిన్య హృదయాలను ద్రవింప చేయగలిగారని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద చెప్పారు. గిరిష్ చంద్ర ఘోష్, కేశవ చంద్రసేన్ వంటి ఉద్దండుల జీవితాలు శ్రీరామకృష్ణ స్పర్శతో చరితార్థం అయ్యాయని గుర్తు చేశారు. రామకృష్ణ బోధనాలతో ఆధ్యాత్మిక సంస్కారాలు జాగృతమయ్యాయన్నారు. గురుదేవుల దివ్య స్పర్శ పరుసవేదిలా మారి సామాన్యులను సాధువులుగా మార్చివేసిందన్నారు. రామకృష్ణ పరమహంస తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరిని అక్కున చేర్చుకుని ఉద్ధరించిన కరుణాసింధువని స్వామి బోధమయానంద కొనియాడారు.